

23 నుంచి తెలుగు భాషా వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 23 నుంచి వాగ్దేవి సమారాధనం సంస్థ ఆధ్వర్యంలో తెలుగుభాషా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పి.స్వప్న హైందవి ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా వివిధ అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకలను పురస్కరించుకొని 23న 8,9,10వ తరగతుల విద్యార్థులకు పద్య పఠనం పోటీలు, 24న 'తెలుగు భాష మనుగడలో యువత పాత్ర' ఇంటర్, డిగ్రీ స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, 25న 5 నుండి 10వ తరగతి విద్యార్థులకు కథలు, కవితలు పోటీ, 26న గ్రామీణ జీవితాన్ని ప్రతిబింబించే సామెతలు పోటీ, 28న క్విజ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యాసంస్థల యాజమాన్యాలు తమ సంస్థలలో పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు పొందిన విద్యార్థుల వివరాలు 28న గురజాడ గృహంలో అందజేయాలని, వారికి 29న బహుమతులు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 8790607303 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉప పోరు ప్రశాంతం

- ఒక స్థానంలో టిడిపి.. మూడుచోట్ల వైసిపి మద్దతుదారుల విజయం
- కొప్పెర్లలో వైసిపి రెబల్ అభ్యర్థి గెలుపు

బొబ్బిలిరూరల్.. వృద్ధురాలిని ఓటు వేసేందుకు తీసుకొస్తున్న ఎస్ఐ భాగ్యం, కానిస్టేబుళ్లు

పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్‌పి దీపిక

విజయనగరం జిల్లాలో స్థానిక సంస్థల ఉప ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఆరు సర్పంచ్ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ రాగా, గజపతినగరం లోగిశ పంచాయతీ ఏకగ్రీవమైంది. శనివారం ఐదు స్థానాలకు ఎన్నిక నిర్వహించారు. అందులో వైసిపి మద్దతుదారులు మూడు స్థానాల్లో గెలుపొందారు. పూసపాటిరేగ మండలం కొప్పెర్లలో వైసిపి రెబల్ అభ్యర్థి విజయం సాధించగా, వంగర మండలం లక్ష్మింపేటలో టిడిపి మద్దతుదారు గెలుపొందారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పూసపాటిరేగ మండలం కొప్పెర్ల, విజయనగరం మండలం పడాలపేట పోలింగు కేంద్రాలను ఎస్‌పి దీపిక సందర్శించారు. భద్రత ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.

పూసపాటిరేగ.. కొప్పెర్ల పోలింగ్ కేంద్రం వద్ద వరుసలో నిలబడిన ఓటర్లు

వార్డు మెంబర్లు

బొబ్బిలిరూరల్.. మండలంలోని కొండదేవుపల్లిలో రెండో వార్డులో టిడిపి బలపర్చిన అభ్యర్థి పూతి సత్యనారాయణ.. వైసిపి మద్దతిచ్చిన రంభ లక్ష్మిపై 26 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల పరిశీలకులుగా ఎంపిడిఒ రవికుమార్, రూట్ ఆఫీసర్‌గా శ్రవణ్ కుమార్ వ్యవహరించారు. సిఐ నాగేశ్వరరావు ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటుచేశారు.

డెంకాడ.. మండలంలోని డి.తాళ్లవలస గ్రామంలో ఏడో వార్డు ఉప ఎన్నికల్లో వైసిపి బలపరిచిన అప్పల సత్యవతికి 105 ఓట్లు, టిడిపి మద్దతు అభ్యర్థికి 17 ఓట్లు వచ్చాయి. 88 ఓట్ల తేడాతో సత్యవతి విజయం సాధించారు.

బొండపల్లి.. మండలంలోని దేవుపల్లిలో 13వ వార్డు సభ్యులుగా టిడిపి మద్దతిచ్చిన గాదం రాజేంద్ర కుమార్ విజయం సాదించారు. రాజేంద్రకు 106 ఓట్లు రాగా, మలిరెడ్డి శ్యామలరావుకు 86 ఓట్లు వచ్చాయి. సిఐ లెంక నారాయణరావు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

జామి.. మండలంలోని లొట్లపల్లిలో పదో వార్డు ఉప ఎన్నికలో వైసిపి బలపరిచిన గంగమ్మ.. ప్రత్యర్థి చందక గౌరిపై 10 ఓట్ల తేడాతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి గంగరాజు ప్రకటించారు.

బాడంగి.. మండలంలోని పాల్తేరులో ఆరో వార్డు ఉప ఎన్నికలో వైసిపి మద్దతుదారు పూడి సత్యవతి.. ప్రత్యర్థిపై 76 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

కొప్పెర్లలో వైసిపి రెబల్ అభ్యర్థి విజయం

పూసపాటిరేగ.. మండలంలోని కొప్పెర్ల సర్పంచ్‌గా వైసిపి రెబల్ అభ్యర్థి సంకాబత్తుల సత్తిబాబు 88 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వైసిపి, టిడిపి ఉమ్మడిగా బలపరిచిన అభ్యర్థి పైడి పార్వతమ్మ ఓటమిపాలయ్యారు. సత్తిబాబుకు ఎంపిడిఒ జి.రామారావు, ఎన్నికల ఆర్ఒ పాపునాయుడు ధ్రువపత్రం అందజేశారు. తనది ప్రజా విజయమని సర్పంచ్ సత్తిబాబు తెలిపారు. గ్రామంలో టిడిపి, వైసిపి, జనసేన కలిసి తనను ఓడించాలని ప్రయత్నించారని, ఓటర్లను బెదిరించారని, అందుకే ప్రజలు తిరగబడ్డారని చెప్పారు.

ధ్రువపత్రం అందుకొంటున్న సర్పంచ్ సత్తిబాబు

వంగర టిడిపికి ఓనిఅగ్రహారం వైసిపికి..

కాబోతుల రుక్మిణమ్మ
ఓని అగ్రహారం

ఆవు సుజాత
లక్షింపేట

వంగర.. మండలంలో లక్షింపేట, ఓని అగ్రహారం సర్పంచ్ స్థానాలకు, రుషింగిలో వార్డు మెంబర్‌కు జరిగిన ఉపఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. లక్షింపేటలో వైసిపి బలపరిచిన అభ్యర్థి వాన లక్ష్మీనారాయణపై టిడిపి మద్దతు అభ్యర్థి ఆవు సుజాత 67 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఓని అగ్రహారంలో టిడిపి బలపరిచిన అభ్యర్థి మజ్జి గౌరీశ్వరిపై వైసిపి మద్దతు అభ్యర్థి కాబోతుల రుక్మిణమ్మ 301 ఓట్లు మెజారిటీతో గెలుపొందారు. రుషింగిలో వార్డు స్థానానికి జనసేన బలపరిచిన అభ్యర్థి యలకల శ్రీనివాసరావుపై వైసిపి మద్దతుదారు యలకల రాము 36 ఓట్లు మెజారిటీతో గెలుపొందారు. లక్షింపేటలో టిడిపి విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం మరింత పెరిగింది.

వృద్ధులకు ఇబ్బందులు

ఓటు వేసేందుకు ఓటర్లంతా శనివారం ఉదయం నుంచి ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అయితే వృద్ధులు, వికలాంగులకు వీల్‌చైర్ వంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో వారంతా ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వారికి సహకరించారు. బందోబస్తును డిఎస్‌పి ఎఎస్ చక్రవర్తి పర్యవేక్షించారు. కార్యక్రమంలో సిఐలు ఉపేంద్ర రావు, రవికుమార్, వంగర, రేగిడి ఎస్ఐలు జనార్దన్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెంటశ్రీరాంపురం సర్పంచ్‌గా గౌతమి

గంట్యాడ .. మండలంలోని పెంటశ్రీరాంపురం పంచాయతీ ఉప ఎన్నికల్లో వైసిపి మద్దతుదారు కరక గౌతమి.. టిడిపి బలపరిచిన కరక రామయ్యమ్మపై 146 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రెండో వార్డు స్థానానికి జరిగిన ఎన్నికలో వైసిపి మద్దతుదారు గేదెల విజయ గెలుపొందారు.

ధ్రువపత్రం అందుకుంటున్న సర్పంచ్ శ్రీదేవి

పడాలపేట సర్పంచ్‌గా శ్రీదేవి

విజయనగరంటౌన్ విజయనగరం మండలం పడాలపేట పంచాయతీ సర్పంచ్‌గా వైసిపి మద్దతుదారు సువ్వాడ శ్రీదేవి విజయం సాధించారు. శ్రీదేవికి 736 ఓట్లు రాగా, టిడిపి మద్దతుదారు సుంకర రామలక్ష్మికి 284 ఓట్లు పోలయ్యాయి. కొండకరకాంలో తొమ్మిదో వార్డు సభ్యులుగా వైసిపి బలపరిచిన తుమ్మగంటి మంగ విజయం సాధించారు.

అభివృద్ధి కోసం మరింత బాధ్యతగా..

- వంద శాతం ఇ- క్రాప్ నమోదు చేయాలి
- శివారు భూములకు కూడా సాగునీరు అందాలి
- జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు
- బొబ్బిలి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం

మరింత బాధ్యతాయుతంగా పనిచేసి, అభివృద్ధిలో రాష్ట్రంలోనే జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేందుకు అధికారులు కృషి చేయాలని ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. కలెక్టర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో బొబ్బిలి నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయం, నీటి పారుదల, నాడు-నేడు, వైద్యారోగ్యం, గృహనిర్మాణం, డ్వామా, తదితర అంశాలపై సమీక్షించారు. ఆయా శాఖల అధికారులు శాఖాపరంగా బొబ్బిలి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలను వివరించారు.

ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి మంత్రి ముత్యాలనాయుడు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి యంత్రాంగం చేస్తున్న కృషిని అభినందించారు. అధికారులు ప్రతి పనికీ నివేదికలు, అనుమతుల కోసం వేచి చూడకుండా, తమ పరిధిలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. వందశాతం ఇ-క్రాప్ నమోదు కావాలని, లేదంటే రైతులు నష్టపోతారని సూచించారు. శివారు భూములకు సైతం సాగునీరు అందేలా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అక్టోబరుకు అన్ని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాన్ని పూర్తిచేసి, వినియోగంలోకి తేవాలని మంత్రి స్పష్టంచేశారు. పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల భవనాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆస్పత్రుల్లో లైట్లు, ఫ్యాన్లు పూర్తిస్థాయిలో బిగించాలని, కిటికీలను మెష్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఉన్నతాధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తనిఖీ చేయాలని సూచించారు. ఇళ్లపై వెళ్తున్న విద్యుత్తు వైర్లను పక్కకు మార్చి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, పాత విద్యుత్తు స్థంభాల స్థానంలో సిమెంటు స్థంభాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ బొబ్బిలి సిహెచ్‌సి అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులను ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. పడకల సంఖ్యను 50కి పెంచాలని, దానికి అవసరమైన సామగ్రి కోసం తక్షణమే ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. తెర్లాంలో విద్యుత్తు సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, పెద్ద మండలం కావడంతో, పూర్తిస్థాయిలో విద్యుత్తు సిబ్బందిని నియమించాలని కోరారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు సమస్యలు ప్రస్తావించారు. గొల్లపల్లిలో కొత్త ఆర్‌బికెను మంజూరు చేయాలని కోరారు. తెర్లాం, ఇతర మండలాల్లో విద్యుత్ సమస్యలను ప్రస్తావించారు. తోటల మధ్యనుంచి విద్యుత్తు లైన్లు వేశారని, వాటిని రోడ్డు పక్కకు మార్చాలని కోరారు. వ్యవసాయ కనెక్షన్లు పెండింగ్ లేకుండా వెంటనే ఇప్పించాలన్నారు. సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, సిపిఒ పొదిలాపు బాలాజీ, బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్ మురళీకృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, బొబ్బిలి నియోజకవర్గంలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు, ఉపాధ్యాయులు

జిఒ 117ను రద్దు చేయాలి

డిఇఒ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిఒ 117ను రద్దు చేయాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యాన శనివారం స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. ఇటీవల బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయుల జీతాలు తక్షణమే చెల్లించాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. గడిచిన మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. పని సర్దుబాటును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో జిల్లా ఉప ప్రధానకార్యదర్శి రమేష్‌చంద్ర పట్నాయక్ ఆధ్వర్యాన చేపట్టిన ధర్నాలో నాయకులు డి.ఈశ్వరరావు, సన్యాసిరాజు, వై.అప్పారావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రమణ, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు

- తీసుకున్న భూమిని కళా వెంకటరావు తిరిగి ఇవ్వమనండి
- జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో పరిశ్రమలను ప్రోత్సహిస్తుంటే ఓర్వలేక టిడిపి నాయకులు విమర్శలు చేస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పరిశ్రమ ఏర్పాటు చేస్తామని కళా వెంకటరావు తీసుకున్న భూమి వెనక్కి ఇచ్చి మాట్లాడాలని హితవుపలికారు. శనివారం జెడ్‌పి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక అభివృద్ధి కోసం బొబ్బిలి గ్రోత్‌సెంటర్ ఏర్పాటు చేశారన్నారు. పరిశ్రమ పెడతామని ఒక సంస్థ ముందుకొస్తే వారికి ప్రభుత్వం భూములు కేటాయించిందన్నారు. కంపెనీకి భూములు కేటాయిస్తే, అది మంత్రి బొత్స సోదరులకు కేటాయించినట్లు వక్రీకరిస్తున్నారని చెప్పారు. అభివృద్ధి చేస్తామంటే టిడిపికి కంటగింపుగా మారిందన్నారు. మాజీమంత్రి కళా వెంకట్రావు కుమారుడికి చంద్రబాబు పది ఎకరాల భూమి ధారాదత్తం చేశారన్నారు. ముందు కళా వెంకట్రావు కుమారుడికి ఇచ్చిన భూములు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఎవరైనా కంపెనీలు పెడతామంటే అంతకన్నా తక్కువ ధరకు కేటాయిస్తామన్నారు. పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఎవరు పరిశ్రమలు పెట్టేందుకు వచ్చినా వారికి భూమి తక్కువకు ఇవ్వడంతోపాటు అన్ని విధాలా సహకారాన్ని అందిస్తామని తెలిపారు. టిడిపి నేతలు తీరును ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. విలేకరుల సమావేశంలో డిసిసిబి వైస్‌ఛైర్మన్ చనుమల్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

టిపిఎల్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక కోరుకొండలోని వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో టిపిఎల్ క్రికెట్ పోటీలను శనివారం సైనిక స్కూల్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి ప్రారంభించారు. మొత్తం 10 జట్లతో ఈ లీగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.లక్ష్మణమూర్తి తెలిపారు. మొత్తం 56 మ్యాచ్‌లు ఉంటాయని, డిసెంబర్ 16న ఫైనల్ నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులకు పాఠశాల ఛైర్మన్ సీతయ్య అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీను, స్వప్న పాల్గొన్నారు.

సవాళ్ల వెనుక పదవీ యావ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ఏ మాటల వెనుక ఏ వర్గ ప్రయోజనం దాగి ఉందో తెలుసుకోలేనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారు' అని అన్నాడు లెనిన్ మహాశయుడు. చీపురుపల్లి నియోజకవర్గంలో ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ విన్యాసాలను పరిశీలిస్తున్న వారిలో చాలామంది అచ్చంగా లెనిన్ ఆలోచనా స్ఫూర్తిని గుర్తుచేస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. చీపురుపల్లి నియోజకవర్గంలో ఇటీవల వైసిపి, టిడిపి మధ్య పరస్పర విమర్శలు చోటు చేసుకుంటున్న విషయం విదితమే. అంతటితో ఆగకుండా వారి వాదన, ప్రతివాదనలను ప్రజల సమస్య మాదిరిగా చిత్రీకరిస్తూ సవాళు,, ప్రతి సవాళ్లకు దిగుతూ రోడ్లపైకి రావడం ఆసక్తికరంగా మారింది. ఉగాది తర్వాత టిడిపి, జనసేన ఉండబోవంటూ మంత్రి బొత్స సత్యనారాయణ శ్రీకాకుళంలో చేసిన వ్యాఖ్యలపై టిడిపి చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున స్పందించిన సంగతి తెలిసిందే. బొత్స వ్యాఖ్యలపై రాతపూర్వకంగా అగ్రిమెంటు ఇవ్వగలరా? అంటూ నాగార్జునతోపాటు చీపురుపల్లికి చెందిన టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. చీపురుపల్లి ఆర్ఇసిఎస్ పరిధిలోని ఎనర్జి అసిస్టెంట్ పోస్టుల నియామకాల్లో అక్రమాలు జరిగాయని, నకిలీ సర్టిఫికెట్లతో కొంతమంది అనుయాయులకు ఉద్యోగాలు ఇప్పించారని కూడా విమర్శించారు. వీటన్నింటినీ తాము నిరూపిస్తామని, ఇరుపక్షాల ఆరోపణలు, వాదనలపై బాండ్ పేపర్ల మీద రాసుకుందామని కూడా సవాలు విసిరారు. తాము నిరూపించిన మరుక్షణం వైసిపి నాయకులు గుండు గీసుకుని రాజకీయ సన్యాసం చేస్తారా? అని సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం చీపురుపల్లి ప్రజల ఇలవేల్పు కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ఇరుపక్షాలకు చెందిన నేతలు చర్చకు సిద్ధమయ్యారు. దీంతో, పోలీసులు ఇరుపార్టీలకు చెందిన నాయకులనూ, ముఖ్యంగా టిడిపి నాయకులను గృహ నిర్బంధం చేసిన సంగతి తెలిసిందే. ఇదంతా వైసిపి, టిడిపి ఆడుతున్న రాజకీయ డ్రామాలేనని చాలామంది వాదన. ప్రజల సమస్యలు వదిలేసి, ఇలా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం వల్ల



ఉపయోగమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆర్ఇసిఎస్‌లో జరిగిన అక్రమాలపై బాండ్ పేపర్లపై సంతకాలకు డిమాండ్ చేసే బదులు, చిత్తశుద్ధి ఉంటే వెంటనే బయటపెట్టాలి కదా? అంటూ జనం చర్చించుకుంటున్నారు. వైసిపికి చెందిన బొత్స అనుయాయులు కూడా పుచ్చకాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్టుగా స్పందించే బదులు, వైసిపి హయాంలో చేసిన ఘనకార్యమేమిటో చెప్పొచ్చు కదా? అని కూడా జనం చర్చించుకుంటున్నారు. వాస్తవానికి నియోజకవర్గంలో సీనియర్ నాయకులు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని ఆశించినప్పటికీ ఆచరణలో కనిపించలేదని చాలా మంది వాపోతున్నారు. పైగా ఈ ప్రాంతంలో ఉన్న ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడ్డాయి. విద్యుత్తు రాయితీలు ఇవ్వకపోతే నష్టమని పరిశ్రమల యజమాలు చేసిన మొర మంత్రి గారికి వినిపించలేదు. పైగా లాభాలు వచ్చినప్పుడు ఎవరికైనా ఇచ్చారా? అంటూ వారిని ఎగతాళి చేశారు. తొందర పడి పరిశ్రమలు మూసేయవద్దంటూ ఉచిత సలహాలు ఇచ్చారు. దీంతో, ఐదు యూనిట్లతో నడిచే గరివిడి ఫేకర్‌లో ఒక యూనిట్ పని నిలిపివేశారు. దీంతో పరిశ్రమలో పనిగంటలు తగ్గాయి. కార్మికులకు పూర్తిస్థాయిలో పనిలేదు. గరివిడి, మెరకముడిదాం, చీపురుపల్లి మండలాల్లోని ఫెర్రో పరిశ్రమలు మూతపడటంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. దీనిపై ఎలాగూ మంత్రి దృష్టిపెట్టలేదు. కనీసం టిడిపి అయినా ప్రశ్నించి ఉంటే బాగుండేదనిది జనం మాట. ఆర్ఇసిఎస్‌లో అవినీతి భాగోతం బయటపెట్టడానికి బాండ్ పేపర్లు వెతుక్కునే బదులు, వెంటనే బయట పెట్టడంతోపాటు అందులో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై మాట్లాడటం లేదు. ఇలా అనేక సమస్యలు నియోజకవర్గాన్ని వెంటాడుతున్నాయి. తోటపల్లి నీరు పూర్తిస్థాయిలో రావడం లేదు. వీటన్నింటిపైనా స్పందించని అధికార, ప్రతిపక్షాలు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు ఇటువంటి సవాళ్లతో హడావుడి చేస్తున్నాయని జనం చర్చించుకుంటున్నారు.

తులసిని అభినందిస్తున్న గ్రామ పెద్దలు

జాతీయ స్థాయి పోటీలకు తులసి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది గ్రామానికి చెందిన కుప్ప తులసి కడప జిల్లా జమ్మలమడుగులో పదో తరగతి చదువుతోంది. ఈమె హాకీ, టెన్నిస్ లోనూ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలోనూ ప్రథమ స్థానాల్లో నిలిచింది. ప్రస్తుతం ఒరిస్సాలోని రూర్కెలాలో జరుగుతున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ పోటీలలో విజేతలుగా నిలిచే వారిని ప్రపంచ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఈ నేపథ్యంలో శనివారం గ్రామస్తులందరూ తులసికి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించి పోటీలకు పంపించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గొంప తులసి, జి.దేముడు, జి. సన్యాసినాయుడు, ఎస్. అప్పలనాయుడు, గొంప వెంకటరమణ గ్రామస్తులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్యం పనులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని అరిగిపాలెంలో గత మూడు రోజులుగా పారిశుధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాలువల్లో పేరుకుపోయిన పూడికను, గ్రామంలో ఉన్న పారిశుధ్యాన్ని కార్మికులతో తీయించి చెత్తను తరలించే రిక్షాలపై డంపింగ్ యార్డ్ తరలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యశోద, గ్రామ పెద్ద గొల్ల సన్యాసిరావు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది గొంప వీధిలో రెండు సంవత్సరాలుగా తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రజాశక్తిలో తాగునీటికి కటకట అనే కథనం వెలువడింది. దీనికి స్పందించిన నియోజకవర్గం ఆర్డబ్ల్యుఎస్ అధికారి పైడిరాజు జెఇ దేవికి పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో ఆమె శనివారం గ్రామానికి వెళ్లి ఎంపిటిసి గొంప తులసిని సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహాత్మా జ్యోతీ భాపూలే బిసి గురుకుల పాఠశాలకు దాతలు కంప్యూటర్లు, ప్రొజెక్టర్, వాటర్ డిస్పెన్సర్లు వితరణగా అందజేశారు. శనివారం విశాఖకు చెందిన ఓషన్ నెట్వర్క్ ఎక్స్ ప్రెస్, రౌండ్ టేబుల్ వైజాగ్77, వైజాగ్ లేడీస్ సర్కిల్ 201 సంస్థల ప్రతినిదులు 10 కంప్యూటర్లు, 4 ప్రొజెక్టర్లు, 2 వాటర్ డిస్పెన్సెర్లు సామాజిక భాద్యతగా మహాత్మా జ్యోతి భా పూలే బిసి గురుకుల పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధికి తగిన సదుపాయాలు కల్పించి విద్యార్థుల భవితకు చేయూత అందిస్తామని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ బిబి రావు దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

మత్స్యకార పాఠశాలను సందర్శన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ఎంజెపి మత్స్యకార ప్రభుత్వ పాఠశాలను డిప్యూటి డిఇఒ కె. వాసుదేవరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎండిఎం కిచెన్, శానిటేషన్, ఐఎఫ్పిలు ఫిక్స్ చేయడానికి రూమ్స్ అవైలబిలిటీ, టీచర్ల లెసన్ ప్లాన్లు 10వ తరగతి నోట్ బుక్స్ వెరిఫికేషన్, అకడమిక్ స్టాండర్డ్స్ క్షుణ్ణంగా పర్యవేక్షించారు. గ్యాప్స్ ఉన్నచోట సూచనలు, సలహాలు ఇచ్చి సరిచేసుకోమని సూచించారు. ఆయన వెంట ఎంఇఒలు యు. సూర్య నారాయణ మూర్తి, ఈపు విజయ్ కుమార్ సందర్శించారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

బొబ్బిలి: విజయవాడలో ఈనెల 21, 22న జరగనున్న ఎన్జిఒ సంఘం రాష్ట్ర కౌన్సిల్ మహాసభలను జయప్రదం చేయాలని బొబ్బిలి తాలూక అధ్యక్ష, కార్యదర్శులు జి.సూర్యనారాయణ, బి.రామారావు కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మహాసభల గోడ పత్రికలను ఎమ్మెల్యే శంబంగి, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల నాయుడు వేర్వేరుగా విడుదల చేశారు. మహాసభలకు ముఖ్య అతిథిగా సిఎం జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారులు సజ్జల రామకృష్ణరెడ్డి, ఎన్జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, కెవి శివారెడ్డి హాజరవుతారని చెప్పారు. మహాసభలను జయప్రదం చేయాలని ఉద్యోగులను కోరారు. కార్యక్రమంలో ఎన్జిఒ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్కు ఆధార్ అనుసంధానం

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యుత్ మీటర్లకు ఆధార్ అనుసంధానం చేయాలని విద్యుత్ శాఖ ఇఇ పూడిహరి ఒక ప్రకటనలో కోరారు. బొబ్బిలి డివిజన్ పరిధిలో ఉన్న బొబ్బిలి మున్సిపాలిటీ, బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం, గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ మండలాలు వినియోగదారులంతా ఆధార్ జిరాక్స్ కాపీలను విద్యుత్ బిల్లు చెల్లించినపుడు లేదా లైన్మెన్కు, సెక్షన్ కార్యాలయంలో బిల్లుతో ఇచ్చి విద్యుత్ మీటర్లకు ఆధార్ అనుసంధానం చేసుకుని సహకరించాలని కోరారు. ఈ నెలాఖరులోగా ఆధార్ అనుసంధానం చేసుకుని ఫోన్ పే, గూగుల్ పే, ఎపిడిఎల్ యాప్ ద్వారా ఆన్లైన్లో బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరారు.

అక్రమ లేఅవుట్పై నోటీసు జారీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అధికారులు పాతిన హెచ్చరిక బోర్డు

మండలంలోని సతివాడలో అక్రమ లేఅవుట్ పై సచివాలయం కార్యదర్శి శనివారం నోటీస్ జారీ చేశారు. సతివాడ రహదారి పక్కన రాతీ వేరు శెనగ మిల్లు సర్వే నెంబర్ 65-4బి మొత్తం 1.24 ఎకరాల స్థలంలో ఎటువంటి అనుమతులూ లేకుండా లే అవుట్ వేయడంతో నోటీస్ జారీ చేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలానికి ఎటువంటి అనుమతులు లేవు కాబట్టి ఎవరైనా అక్రమ లే అవుట్ వేసినా స్థలం కనుగోలు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో సోంపురం జంక్షన్ నుండి వేపాడ మీదుగా అనందపురం జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు నిమిత్తం ప్రభుత్వం రూ.39 కోట్లు విడుదల చేసింది. అరిగి పాలెం నుండి సోంపురం గ్రామాలకు మధ్యన రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇల్లు విస్తరణ పనులకు ఆటంకంగా మారాయి. ఈ నేపథ్యంలో శనివారం తహశీల్దార్ ప్రసన్నకుమార్ ఆ ఇళ్లను పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా ఆర్అండ్బి స్థలంలో ఇళ్ల కట్టుకున్న వారంతా ఆ స్థలం తమదని కోర్టులో కేసులు కూడా ఉన్నాయని వాధించడంతో తహశీల్దారు పరిశీలన చేశారు. అరిగి పాలెం గ్రామానికి చెందిన పెద్దలు తామంతా కూర్చొని సమస్య పరిష్కరించుకుంటామని తహశీల్దార్కు వివరించారు. ఈ పరిశీలనలో మండల సర్వేయరు, ఆర్అండ్బి అధికారులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సర్వేరు, గ్రామ పెద్దలు దున్న సన్యాసిరావు, దుల్ల వెంకటరమణ పాల్గొన్నారు.

నూతన వార్డు మెంబర్లు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని గ్రామపంచాయతీ వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా గెలుపొందారు. తుమ్మికాపల్లి మూడో వార్డు మెంబరు కెంగం జ్యోతి, కాటకాపల్లి రెండో వార్డు మెంబరు చుక్క భవాని శనివారం అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.

వీర జవాన్ తల్లిదండ్రులకు సన్మానం

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని అంట్లవార గ్రామానికి చెందిన సిఆర్పిఎఫ్ జవాన్ గుల్లిపల్లి శ్రీనివాసరావు విధి నిర్వహణలో 2018 వీరమరణం పొందిన విషయం విధితమే. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా వీర జవాన్లకు నివాళులర్పించడం దేశ సంప్రదాయం. అందులో భాగంగా లింగాపురం నా భూమి నా దేశం శిలాఫలకం దగ్గర వీర జవాన్ తల్లిదండ్రులను అసిస్టెంట్ కమాండెంట్ భగత్ సింగ్ సాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి తవిటి నాయుడు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మం నాయుడు, తెర్లాం కానిస్టేబుల్ దాసు ఇరు గ్రామాల పెద్దలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అవగాహనతోనే దోమలు నివారణ

ప్రజాశక్తి- బొబ్బిలి

అవగాహన తోనే దోమల వ్యాప్తి నియంత్రణ సాధ్యమని ట్రిబుల్ ఎస్ డిగ్రీ కాలేజి వ్యవస్థాపకులు, విశ్రాంత ఉద్యోగుల నాయకులు రౌతు రామ్ మూర్తి అన్నారు. శనివారం ట్రిబుల్ ఎస్ డిగ్రీ కాలేజీలో బొబ్బిలి రోటరీ ఆధ్వర్యంలో ప్రపంచ దోమల నిర్మూలనా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు దోమల వ్యాప్తి-నియంత్రణ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని మెంబర్షిప్ డెవలప్మెంట్ చైర్ చంద్రశేఖర్, కోశాధికారి శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వ్యాపి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, ఫైలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, ఎల్లో ఫెవర్ తదితర జ్వరాలు బారిన పడతారని చెప్పారు. ఇంటి, కళాశాలలు, పాఠశాలల పరిసరాలు మురుగు నీరు నిల్వ లేకుండా చేయాలని, కొబ్బరి బొండాలు, పాత టైర్లు వాడకుండా ఉన్న నీటి ట్యాంక్ లలో నీరు నిల్వ లేకుండా చేయాలన్నారు. అనంతరం హెర్బల్ మస్కుల బాటిల్స్ను హాజరైన 400 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు శ్రీహరి, కె నాగరాజు, రామకృష్ణ, డేవిడ్ జె విక్టర్, కళాశాల ప్రిన్సిపాల్ మోహన రావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తవలస: గ్రామాల్లో సర్వేను పరిశీలిస్తున్న సాయికుమార్, తదితరులు

శృంగవరపుకోట: 'దోమ వంటి చిన్న ప్రాణులు వల్లనే పెద్ద హాని సంభవిస్తుందని దోమల వల్ల మలేరియా, డెంగీ, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయని, లార్వా దశలోనే దోమల వ్యాప్తిని నిరోధించి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కన్సల్టెంట్ సాయికుమార్ పిలుపునిచ్చారు. ఎస్.కోట శివారు పుణ్యగిరి గ్రామంలో దోమల దినోత్సవం పురస్కరించుకుని శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దోమలు పెరిగే అవకాశాలు లేకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీ టైర్లు, కొబ్బరి బొండాలు, కుండలు, గోలాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్పి రమణ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, పర్యవేక్షకులు శ్రీనివాసరావు, రాజశేఖర్, ఎంఎ శంకరరావు, ఎంఎల్హెచ్పి సుశీల, ఏఎన్ఎం పార్వతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొత్తవలస: వియ్యంపేట పిహెచ్సి పరిధిలో వియ్యంపేట, ముసిరామ్ గ్రామాలలో ఎన్విబిడిసి స్టేట్ కన్సల్టెంట్ జి సాయికుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో పర్యటించి కీటక జనిత వ్యాధులు డెంగీ, మలేరియా, డ్రై డే నిర్వహణ, గ్రామాలలో వ్యాధులు పై అవగాహనా కార్యక్రమాలు జరిగే తీరు పై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాలలో ప్రతీ రోజు పర్యటించి నీటి నిల్వ ఉన్న ప్రదేశాలు, టైర్లు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ డబ్బాలు ఇంటి ముందు ఉండకుండా చూడాలని, జ్వరాలు పై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వియ్యంపేట వైద్యులు బి. సింహాద్రి నాయుడు, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ డేగల వెంకట రమణ, సబ్ యూనిట్ ఆఫీసర్ బి. శ్రీనివాసరావు, ఎంఎస్టి. రాజశేఖర్, ఇఒ నరసింహారావు పాల్గొన్నారు.

విద్యా సంకల్ప పరీక్షల్లో నలుగురు ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పరీక్షల ఫలితాలు వెల్లడించిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

చదువుకున్న యువతను ప్రోత్సహించడంలో భాగంగా ఇటీవల పట్టణంలోని పుణ్యగిరి కళాశాలలో నిర్వహించిన గొంప విద్యాసంకల్ప పరీక్షల్లో నలుగురు టాపర్స్ను ప్రొఫెసర్, టీచర్ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు నేతృత్వంలోని కమిటీ ఎంపిక చేసిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, యువనేత గొంప కృష్ణ వెల్లడించారు. ఎస్.కోటలోని తన కార్యాలయంలో శనివారం సాయంత్రం టిడిపి నాయకులతో కలిసి 'గొంప' పరీక్షల ఫలితాలను ప్రకటించారు. డిఎస్సి మోడల్ పరీక్షకు పురుషులు-10, మహిళలు-15 మంది హాజరుకాగా వారిలో ఎస్.కోట మండలం వినాయకపల్లి గ్రామానికి చెందిన గనివాడ గౌరినాయుడు, వేపాడ మండలం బొద్దాం గ్రామానికి చెందిన పల్లి శ్రావణి 67 మార్కులు చొప్పున రావడంతో ఇద్దరినీ కమిటీ ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ టెస్టుకు 48 కటాఫ్ మార్కులుగా నిర్ణయించారన్నారు. ఇక ఎస్.ఐ, కానిస్టేబుల్ మోడల్ పరీక్షలకు మహిళలు-39, పురుషులు-31 మంది హాజరుకాగా ఎస్.కోట మండలం కొట్టాం గ్రామానికి చెందిన కొట్టుగుమడ మోహన్ బాబు 66 మార్కులు సాధించి టాపరుగా నిలిచాడని, ఈ పరీక్షకు కటాఫ్ 40 మార్కులన్నారు. గ్రూప్ 1, 2 మోడల్ పరీక్షకు పురుషులు-49, మహిళలు-33మంది హాజరుకాగా ఎస్.కోట మండలం, సంతగయిరమ్మపేట గ్రామానికి చెందిన గోగాడ వెంకటరమణ 60 మార్కులు సాధించి టాపరుగా నిలిచాడని, ఈ పరీక్షకు 41 కటాఫ్ మార్కులని, ఈ నలుగురు వారి గ్రూపుల్లో టాపర్లుగా నిలిచారని చెప్పారు. టాపర్లుగా నిలిచిన నలుగురు విద్యార్థులకు ఉచితంగా వారు ఎంచుకున్న పుస్తకాలు అందజేయడంతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వారు కోరుకున్న కోచింగ్ సెంటరులో చేరి చదువుకోవచ్చని, ఇందుకోసం అయ్యే ఫీజులో 50శాతం తాము చెల్లిస్తామని గొంప కృష్ణ స్పష్టం చేశారు. ఈ పరీక్షల ఫలితాలు ఆన్లైన్లో త్వరలోనే వెల్లడించటంతో పాటు సెప్టెంబర్15 లోగా వీరి కోచింగ్కి అవసరమైన పుస్తకాలు అందజేస్తామని చెప్పారు. మొత్తంగా ఈ ఎపిపిఎస్సి మోడల్ పరీక్షలకు 1350 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 882 మంది హాజరయ్యారని, 177మంది ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు.సమావేశంలో టిడిపి నాయకులు ఎల్. రవికుమార్, ఆర్.చంద్రశేఖర్, గొరపల్లి రామ్, జె.రామసత్యం, ఇ.త్రివేణి, గుమ్మడి భారతి, ఎం.మంగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కొండ ప్రాంతంలో నిల్వ ఉన్న ఇసుక పోగులు

వైసిపి నాయకుల అండతో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. ముఖ్యంగా చంపావతి నది పరివాహక ప్రాంతాలు జరజాపు పేట, మొయిద కాజ్వే, రామతీర్థం కాజ్వే, జ్యూట్ మిల్లు సమీపంలో వంతెన, కుదిపి నీలంరాజుపేట సమీపంలో ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్లు, నాటు బల్లు, ద్వి చక్ర వాహనాల ద్వారా తరలించి వేరే ప్రాంతాల్లో డంప్ చేసి రాత్రుళ్ళు లారీల ద్వారా తరలిస్తున్నారు. మిల్లు బ్రిడ్జి వద్ద నీటి పథకాల వద్ద కూడా మిని ఆటోలు, ఎడ్లు బళ్ళు ద్వారా ఇష్టానుసారంగా రవాణా జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. గుడి నిర్మాణాలు పేరిట ఇసుక అక్రమంగా తరలించి వేలాది రూపాయలు అక్రమార్జన చేస్తున్నారని సమాచారం. మంచి నీటి పథకాల వద్ద కూడా ఇసుక తవ్వకాలు జరపడంతో తాగునీరు రంగు మారి బురదనీరు సరఫరా అవుతుందని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాటు బండ్లు, ఆటోల ద్వారా ఇసుకను నిల్వ చేసి రాత్రి వేళల్లో లారీల ద్వారా అమ్మకాలు జరిపి అక్రమార్కులు వేలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. వైసిపి నాయకుల అండదండలతో ఇసుక దందా జరుగుతున్నట్లు సమాచారం. ఇంత జరుగుతన్నా ఇసుక అక్రమ రవాణాపై అధికార యంత్రాంగం మాకెందుకులే అన్నట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని కొంత మంది వ్యక్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా సరే పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అక్రమార్కులపై చర్యలు తీసుకొని మంచి నీటి పథకాలను పరిరక్షించాలని కోరుతున్నారు.

బిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో వ్యవసాయం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

తుంపర్ల సేధ్యాన్ని పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

బిందు, తుంపర సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేయవచ్చునని ఎపి ఎంఐపి పీడీ పి.ఎన్.వి లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ముషిడిపల్లి గ్రామంలోని రైతు గార్లపాటి సత్యసాయికి రాయితీపై అందించిన తుంపర సేద్యం యూనిట్ను శనివారం ఆయన పరిశీలించారు. మెట్ట ప్రాంతంలో పంటల సాగుకు బిందు, తుంపర్ల సూక్ష్మ సేంద్రియ విధానాలు లాభదాయకమని అన్నారు. మండలంలో 24 మంది రైతులకు రూ.4.86 లక్షలతో 56 సూక్ష్మ సేద్య యూనిట్లను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ హార్టికల్చర్ అధికారి ఎం లావణ్య ప్రభ, ఎంటి ఏఓ మూర్తి, వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల తల్లికి ఆరోగ్యం

నవధాన్యాల సాగుతో నేలతల్లి ఆరోగ్యం కాపాడవచ్చునని రీజనల్ ప్రకృతి వ్యవసాయ అధికారి హేమ సుందర్ అన్నారు. శనివారం మండలంలోని వినాయక పల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి రవీంద్ర ఆధ్వర్యంలో పలు పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల గట్లు పై బంతి, కంది, చిక్కుడు, బెండ బహుళ పంటలు పసుపు పల్లాలు, చేసి జీవామృతం కవర్ పెట్టాలన్నారు. ప్రకృతి వనరుల కేంద్రంలో కషాయాలు వృద్ధి ద్రావణంల తయారీ, సరఫరా చేయాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిఎ రవి, రైతులు పాల్గొన్నారు.

'గడప గడపకు' లో సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వాటర్ ట్యాంక్ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నగర పంచాయతి పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు సమస్యలు ఏకరువు పెట్టారు. శనివారం నగర పంచాయతి పరిధి శెగిడి పేట 12, 13వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేశ్ బాబు వార్డుల్లో పర్యటించి రూ.2లక్షలతో నిర్మించిన మంచి నీటి పథకాన్ని ప్రారంభించారు. ఈ పర్యటనలో పలువురు స్థానికులు, టిడిపి కౌన్సిలర్ ముడు మంచి లక్ష్మీ, నాయకులు లక్ష్మణరావు ఆయా వార్డులో తాగు నీటి సౌకర్యాలు, సీసీ రోడ్లు, కాలువలు వేయాలని వినతి పత్రం అందజేశారు. ఇళ్ల పట్టాలు ఇచ్చి 3సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు స్థలాలు చూపించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మీరు సంక్షేమ పథకాలు లెక్క చెబుతున్నారు గాని ఇళ్లు నిర్మించిన వారికి బిల్లులు చెల్లింపు జరగలేదని ఆరోపించారు. అనంతరం సమస్యలు విన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ సంబంధిత అధికార్లతో మాట్లాడి ఆయా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతి ఛైర్పర్సన్ బంగారు సరోజినీ, వైస్ ఛైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, కో ఆప్షన్ సభ్యులు చిక్కాల సాంబశివరావు, నాయకులు గంటా అప్పల రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగార్జున జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- గరివిడి, విజయనగరం కోట

నాగార్జునకు కేక్ తినిపిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు, చీపురుపల్లి నియోజకవర్గ ఇంచార్జి కిమిడి నాగార్జున జన్మదిన వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా నలుమూలల నుంచి నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. చీపురుపల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున అభిమానులు ర్యాలీగా కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అభిమానుల సమక్షంలో నాగార్జున చీపురపల్లి తన నివాసం వద్ద, విజయనరగంలోనూ కేకు కట్ చేసి పంచిపెట్టారు. ఇంతమంది కుటుంబ సభ్యులను సంపాదించుకోవడం తన అదృష్టంగా పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ అందరి ప్రేమాభిమానాలు ఇలానే ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనను ఆశీర్వదిస్తూ పండితులు, పాస్టర్లు, ముస్లిం పెద్దలు సర్వమత ప్రార్థనలు చేశారు. నాగార్జునను ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు రౌతు కాము నాయుడు, పైల బలరాం, వెన్నె సన్యాసినాయుడు, చనమల మహేశ్వర రావు, సారేపాక సురేష్ బాబు, దన్నాన రామచంద్రుడు, తాడ్డి సన్యాసినాయుడు, రెడ్డి గోవింద, ముల్లు రమణ, కంది మురళి నాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు కంది చంద్రశేఖర్, కడగల ఆనంద్, గేదెల రాజారావు, బొబ్బిలి నియోజకవర్గ నాయకులు అల్లాడ భాస్కరరావు, గెంబలి శ్రీనివాసరావు, సుంకరి రమేష్, పతివాడ తమ్మి నాయుడు, కిమిడి అశోక్, కుమరాపు రవి, కుర్మారావు, విజ్జి ప్రసాద్, చంటి రాజు, గోవింద, ఎస్.ఎం. బాషా, మహంతి శంకరరావు, ఆరతి సాహు, వాయునంద శర్మ ఉన్నారు.

మలేషియాలో రాణించిన మౌక్తిక

ప్రజాశక్తి- గుర్ల

మౌక్తిక

పిట్ట కొంచెం కూత ఘనం అనే సామెత ఆ చిన్నారికి వర్తిస్తుంది. ఆరేళ్ళ వయసులోనే సంప్రదాయ నృత్యంలో రాణిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇప్పటికే స్థానికంగా పలు ప్రదర్శనలు చేసిన ఆ అమ్మాయి తాజాగా మలేషియాలో కూడా తన నృత్య ప్రదర్శనతో అక్కడి వారిని ఆకట్టుకుంది. అక్కడి తెలుగు వారి ప్రశంసలు సైతం పొందింది. ఇదీ విశాఖపట్నం నగరానికి చెందిన చిన్నారి మౌక్తిక ఘనత.

విశాఖ నగరానికి చెందిన బి యోగి, సౌజన్యల కుమార్తె చిన్నారి మౌక్తిక సంప్రదాయ నృత్యంలో రాణిస్తోంది. విశాఖ వ్యాలీ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న మౌక్తిక సంప్రదాయ నృత్యంలో ఇప్పటికే పలు ప్రదర్శనలు ఇచ్చింది. తాజాగా ఇండో-మలేషియన్ కల్చర్ ఎక్స్ఛేంజ్ అనే సంస్థ ఆధ్వర్యంలో మలేషియా రాజధాని కౌలాలంపూర్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో దేశం తరుపున మౌక్తిక పాల్గొంది. అక్కడ తన నృత్య ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకుంది. చిన్నారి ప్రదర్శనకు ముగ్ధులైన నిర్వాహకులు ప్రశంసాపత్రం అందజేశారు. భవిష్యత్తులో సంప్రదాయ నృత్యంలో మరింత రాణించాలని పలువురు ఆకాంక్షించారు.

జూనియర్ల పట్ల స్నేహపూర్వంగా ఉండాలి : సివిల్ జడ్జి

ప్రజాశక్తి- గరివిడి

మాట్లాడుతున్న సివిల్ జడ్జి విజయరామేశ్వరి

స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, కాలేజీ యన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిరోధకతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జ్, చీపురపల్లి లీగల్ సర్వీసెస్ కమిటీ మండల ఛైర్పర్సన్ ఎమ్.విజయ రామేశ్వరి పాల్గొని మాట్లాడారు. సీనియర్స్, జూనియర్ విద్యార్థుల పట్ల స్నేహ పూర్వకం వాతావరణం ఉండాలన్నారు. విద్యార్థులు ర్యాగింగ్కు పాల్పడితే జరిగే నష్టాలు వివరిస్తూ, ఏపి ప్రొహిబిషన్ ర్యాగింగ్ యాక్ట్ -1997 వంటి చట్టాల ద్వారా కనీసం 6 నెలలు నుండి జీవితాంతం జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఒక విద్యార్థికి ర్యాగింగ్ ద్వారా జైలు శిక్ష పడినట్లయితే ఆ విద్యార్థిని కాలేజీ నుంచి బహిష్కరించడమే కాకుండా, మరి ఏ కాలేజీలో కూడా అడ్మిషన్ పొందలేరన్నారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలతో పాటు ర్యాగింగ్ చట్టాలపై విద్యార్థులకు వివరిస్తూ, కేసుల్లో ఇరుక్కొని జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యతతో చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. గరివిడి ఎస్ఐ ఎల్.దామోదరరావు మాట్లాడుతూ యూట్యూబ్, ఫేసుబుక్, ఇన్స్టా గ్రామ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా యాప్స్ ద్వారా మోసాల భారినపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అని సూచించారు. ప్రస్తుత సమాజంలో ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, ప్రైవేటు ఉద్యోగానికి కూడా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ చాలా ముఖ్యమని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ వి. జాషువ జయప్రసాద్ మాట్లాడుతూ కాలేజీలో ర్యాగింగ్ నిరోధానికి అనేక చర్యలు చేపట్టామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులతో కమిటీలు వేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ర్యాగింగ్ రహిత కళాశాలగా తీర్చిదిద్దుకుంటున్నామన్నారు. విద్యార్థులకు హెల్ప్లైన్ నెంబర్లు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో లోక్అదాలత్ మెంబర్ బి.శ్రీదేవి, న్యాయవాదులు డి.రఘుపతి నాయుడు, కె.త్రినాధ రావు, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్ కుమార్, యన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.సత్యం, వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

కను'మరుగు'

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల వసతి గృహంలో విద్యార్థినిల కోసం నిర్మించిన మరుగుదొడ్లు కనిపించకుండా దట్టమైన డొంకలు, పిచ్చి మొక్కలు వేపుగా పెరిగిపోయాయి. మరుగు దొడ్ల భవనం చుట్టూ దట్టమైన డొంకలు తయారవడంతో బాలికలు మరుగుదొడ్లకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఈ మొక్కలు ద్వారా మరుగుదొడ్లలోకి పాములు వచ్చేస్తున్నాయని భవనంపైకి ఎగబాకిన మొక్కలను తొలగించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

పిచ్చిమొక్కలతో ఉన్న మరుగుదొడ్లు భాగం

బాల్యం చదువు కోసమే

ప్రజాశక్తి - జామి

మాట్లాడుతున్న రామకృష్ణ

బాల్యం చదువుకోసమే వినియోగించాలని చిన్నతనంలో పెళ్లి చేసుకోకూడదని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని కుమరాం కెజిబివి పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనత, పౌష్టికాహారం, జంక్ ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాల్యంలో బాగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలన్నారు. బాల్య వివాహాల వల్ల కొందరు పేదరిక విష వలయంలో చిక్కుకొంటున్నారని, అనారోగ్యాలతో మరణాలు సంభవిస్తున్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ బివి సులోచన, ఉపాధ్యాయులు దమయంతి, శారద, పార్వతి, శిరీష,ఉపాధ్యాయులు, ఎ.ఎన్.ఎం కన్నతల్లి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకులకు పట్టని ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి- మెరక ముడిదాం

గోతులమయమైన మానాపురం రోడ్డు

మండలంలోని గర్భాం నుంచి మానాపురం వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా మరమ్మతులకు గురైంది. గర్భాం సెంటర్ నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మధ్యలో రహదారి పూర్తిగా పాడైపోవటం, పెద్ద పెద్ద గుమ్ములు పడటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గర్భాం జిల్లా పరిషత్తు పాఠశాలకు, ఆదర్శ పాఠశాలకు ఆటోలతో, సైకిల్ మీద తిరుగుతున్న విద్యార్థులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. కొన్ని వాహనాలు ఆ గుమ్ముల్లో చిక్కుకోవడం వల్ల ట్రాక్టర్ సహాయంతో బయటకు తీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ రోడ్డు గుండా రాత్రిపూట ప్రయాణం మరింత నరకాన్ని తలపిస్తోంది. ఇంత అధ్వాన్నంగా ఉన్న రోడ్డుపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టకపోవడంపై ప్రయాణికులు పెదవివిరుస్తున్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ నియోజకవర్గం, జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్న మండలం అయినప్పటికీ ఈ రహదారిపై దృష్టి సారించకపోవటంతో పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

కెఆర్ పేటకు తప్పని కష్టాలు

వేపాడ: మండలంలోని కృష్ణరాయిపేట గ్రామానికి వెళ్లే కల్వర్టు పూర్తిగా ధ్వంసమవడంతో రాకపోకలకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికంగా కల్వర్టుపై కర్రలు ఏర్పాటు చేసుకొని నడుచుకుని వెళుతున్నా అది ఎప్పుడు కూలిపోతుందోనని భయపడుతున్నారు. ఏమాత్రం కాలు జారిన కాలువలో పడి ప్రమాదాన్ని కొని తెచ్చుకుపోవడమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే కూలిపోయిన కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నారు.